సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలి



ఉప కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌కు చెందిన మాధవరెడ్డి తమ కాలనీలో సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. గురువారం కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహకు వినతిపత్రం అందజేశారు. రాత్రి తమ కాలనీలో అంధకారం నెలకొంటుందని, దీంతో మహిళలు, వృద్ధులు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారని వివరించారు. కాలనీలోని ప్రధాన చౌరస్తాల్లో హైమాస్ట్ లైట్లను అమర్చాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

నిజాంపేట్ : ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని కొలన్ గోపాల్ రెడ్డి అన్నారు. గురువారం ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 2 నిస్సీ ఫెయిత్ చర్చ్ క్రిస్టియన్ సభ్యులు ఆయనను కలిసి సమస్యలు వివరించారు. కార్యక్రమంలో పాస్టర్ కుమార్, సీసీడబ్ల్యూ ప్రెసిడెంట్ జాషువా పుచ్చకాయల, గాయత్రి గార్డెన్స్ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత



నిజాంపేట్ : బాచుపల్లి మండలం నిజాంపేట్ గ్రామంలోని సర్వే నంబర్ 348, 191, బాచుపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 293లోని అక్రమ నిర్మాణాలను గురువారం కూల్చివేశారు. బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ భాను ఆధ్వర్యంలో సిబ్బందితో నిజాంపేట్‌లోని తురక చెరువులో ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నిర్మాణాలను, 191 సర్వే నంబర్‌లోని నిర్మాణాలను, రాజీవ్ గాంధీ నగర్‌లోని ప్రభుత్వ స్థలంలో వెలసిన నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్



పాదయాత్రలో పాల్గొన్న పార్టీ నాయకులు

నిజాంపేట్ : కాంగ్రెస్ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఎన్‌ఎంసీ అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆగం పాండు, జీవన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, విష్ణు, సాయిరాజ్, యేసు, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారికి పోలీసుల కృతజ్ఞతలు

నిజాంపేట్: బాచుపల్లి సీఐ ఉపేందర్‌కు బాచుపల్లికి బందోబస్తు కోసం వచ్చిన పోలీసులు స్టేషన్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సీఐ ఉపేందర్ గతంలో ఆమనగల్లులో విధులు నిర్వహించారు. అక్కడ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టాడు. శిక్షణను సద్వినియోగం చేసుకొని అనేకమంది నిరుద్యోగ యువత ఉద్యోగాలను పొందారు. బాచుపల్లిలోని దర్గా ఉర్సు ఉత్సవాలు జరుగుతున్నాయి. బందోబస్తుగా ఆమనగల్లులో శిక్షణ పొంది పోలీస్ ఉద్యోగాలు సాధించిన వారు విధులకు హాజరయ్యారు. బాచుపల్లి సీఐగా తమకు ఉద్యోగాలు వచ్చేందుకు శిక్షణ ఇప్పించిన అధికారి ఇక్కడే ఉన్నారని తెలుసుకుని స్టేషన్‌కు వచ్చి ఉపేందర్‌ను సన్మానించారు.

స్థల వివాదం : కేసు నమోదు

సుభాష్‌నగర్: ఇంటి స్థల విషయమై రెండు కుటుంబాల మధ్య మాట మాట పెరిగి ఘర్షణకు దిగిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సాయిబాబా నగర్ కృషి కాలనీలో నివాసముండే పల్లపు వరయ్య, బొంత కిరణ్‌ల మధ్యలో ఉన్న 130 గజాల స్థల విషయమై కొంత కాలంగా వివాదం నడుస్తోంది. తాజాగా ఈ నెల 15న రాత్రి 9.30 గంటల సమయంలో ఇరు కుటుంబాలు స్థలం వద్ద గొడవపడ్డారు. దీంతో మాటామాట పెరిగి కర్రలు, రాడ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఇద్దరి యువకులపై ఐదుగురు కర్రలతో దాడి చేసిన వీడియో స్థానికంగా వైరల్ అయ్యింది. దీంతో సూరారం పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



రోడ్డుపైనే డ్రమ్ములను పగలగొడుతున్న కూలీలు

రోడ్డుపైనే స్క్రాప్ దందా!

- ఉదయం అన్‌లోడింగ్, సాయంత్రం లోడింగ్
- రోడ్డుపైనే వ్యర్థాలు
- పట్టించుకోని అధికారులు

రోడ్లపైనే అన్‌లోడింగ్, లోడింగ్. అక్కడే డంపింగ్. వీరి పరిశ్రమ కేరాఫ్ ఎస్వీ కో ఆపరేటివ్ రోడ్లు. వీరిని అడిగేవారు లేరు. అధికారులు ఉన్నా వీరి జోలికి పోరు. ఇక అంతే ఎవరి ఇష్టం వారిది. జీడిమెట్ల ఎస్వీ కోఆపరేటివ్ సొసైటీలో కొంత మంది స్క్రాప్(తుక్కు) వ్యాపారులు సొసైటీలో కొత్త తరహా దందాకు తెరలేపారు. వీరికి సొసైటీ అధికారులు వత్తాసు పలుకుతున్నట్లు తెలుస్తోంది.
– జీడిమెట్ల

రోడ్లే వ్యాపార కేంద్రంగా..

ఉదయం ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలోని ధర్మకాంట సమీపంలో టీజీఐఐసీ గోడను అవాసంగా చేసుకుని దందా సాగిస్తున్నారు. కొంతమంది వివిధ ప్రాంతాల నుంచి డ్రమ్ములను కొనుగోలు చేసి రోడ్డు పక్కన డంప్ చేస్తున్నారు. కొనుగోలు చేసిన డ్రమ్ములను కూలీలచే పగులగొట్టించి ఒక్కచోట ఉంచి సాయంత్రం వరకు లోడింగ్ చేసి పంపిస్తున్నారు.



రోడ్డుకు ఇరువైపుల డంప్ చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

రసాయనాలు, వ్యర్థాల పారబోత

డ్రమ్ములను కడగడం, వీరగొట్టడం ద్వారా డ్రమ్ముల్లోంచి వెలువడిన వ్యర్థ రసాయనాలను రోడ్లపైనే పారబోస్తారు. ప్లాస్టిక్ కవర్‌ల లాంటి వ్యర్థాలు ఉంటే అక్కడే రోడ్డుపైన కుప్పలుగా వేసి వెళ్లిపోతారు. ఇంత జరుగుతున్న సొసైటీ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని రోడ్లపై డంపింగ్ చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను, డ్రమ్ములను అక్కడ నుంచి ఖాళీ చేయించాలని కోరుతున్నారు.



డ్రమ్ములను కడిగి రోడ్డుపైనే పారబోసిన వ్యర్థాలు

ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్‌ఎస్‌దే విజయం

- రజతోత్సవ సభకు భారీగా జన సమీకరణ చేయాలి
- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్: ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గండి మైసమ్మలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి వారు హాజరై మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 16 నెలల్లో ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ప్రజలు ఏం కోల్పోయారో వారికి అర్థమైందన్నారు. కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. సభకు ప్రత్యేక బస్సుల్లో నియోజకవర్గం నుంచి భారీగా జనసమీకరణ చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను స్థానికంగా ఉండే ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకోవాలన్నారు. కార్యకర్తలు రాబోయే రోజుల్లో స్థానికంగా ప్రజలతో మమేకమై సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అంతకు ముందు తెలంగాణ తల్లికి పూలమాల వేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కార్పొరేషన్, నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పక్కన ఎమ్మెల్యే వివేకానంద్

కేంద్రం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

జగద్గిరిగుట్ట: ప్రధాని నరేంద్రమోదీ ప్రతిపక్ష పార్టీలపై కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్యగౌడ్ అన్నారు. గురువారం జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూమ్‌నగర్‌లో మాజీ కౌన్సిలర్ వరమ్మ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియాగాంధీ, లోక్‌సభా పక్ష నేత రాహుల్ గాంధీలపై ఈడీతో చార్జిషీట్ దాఖలు చేయించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసులో వారిపై చార్జిషీట్‌ను వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్రీయ దళిత సేన ఓబీసీ జాతీయ ఉపాధ్యక్షుడు జనార్ధన్, యువజన కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, మహేష్, లక్ష్మి, సులోచన, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు జీతాలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

దుండిగల్: మున్సిపాలిటీ కార్మికులకు జీతాలు చెల్లించాలని, రెండు నెలల నుంచి సరైన సమయంలో జీతాలు రాక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని సీఐటీయూ మండల కన్వీనర్ బొడిగె లింగస్వామి అన్నారు. గురువారం గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో కార్మికులు కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్‌లో పని చేసే కార్మికులకు జీతం రాలేదని, కార్మికులు ఇంటి కిరాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే కమిషనర్ స్పందించి జీతాలు వచ్చే విధంగా చూడాలని కోరారు. అదేవిధంగా కార్మికులకు రావాల్సిన దుస్తులు, చెప్పులు, సబ్బులు, కొబ్బరి నూనెలు తక్షణమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు నరసింహ, సురేందర్, ఎల్లయ్య, బాబు, స్వరూప, రేణుక, భవాని, కృష్ణవేణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలని వినతి

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కరించాలని బీఆర్‌ఎస్ నేతలు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌లను గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. భౌరంపేటలో కొన్ని రోజులుగా నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారంలో ఒక్క రోజు కూడా సరిగ్గా సరఫరా కావడం లేదని తెలిపారు. సానుకూలంగా స్పందించిన వారు.. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు బెంబడి బుచ్చిరెడ్డి, మురళీ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, మన్నె శేఖర్ ముదిరాజ్, కటకం వీరేశ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



శంభీపూర్ రాజు, వివేకానంద్‌లకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రోడ్డు పక్కనే డంపింగ్



రోడ్డు పక్కనే డంప్ చేసిన బిల్డింగ్ వ్యర్థాలు



పైపులైన్ రోడ్డులో ఏర్పాటు చేసిన ప్లాంట్

జగద్గిరిగుట్ట: షాపూర్ నగర్ నుంచి జగద్గిరిగుట్టకు వెళ్లే హెచ్‌ఎంటీ పైపులైన్ రోడ్డులో అడ్డదిడ్డంగా మట్టిని పోస్తున్నారు. దీని ద్వారా నిత్యం ట్రాఫిక్ రద్దీతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మెటీరియల్ వేయవద్దని అక్కడ ఎస్‌టీపీ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేశారు. డబ్బును చెల్లించడం ఇష్టం లేక రోడ్డు పక్కనే డంప్ చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డులో టిప్పర్లతో తెచ్చి డంప్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిఘా పెంచి రోడ్డుకు ఇరువైపులా డంప్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చెత్త నిండింది.. తరలించడం మిగిలింది

రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్ల వెంబడి చెత్త పారబోయకుండా ఏర్పాటు చేసిన తడి, పొడి చెత్త బిన్‌ల నిర్వహణ కొరవడింది. ప్రతి రోజు డంబర్ బిన్‌లలో చెత్తను తరలించాల్సి ఉండగా.. ఆ దిశగా పారిశుద్ధ్య కార్మికులు పని చేయడం లేదు. దీంతో డంపర్ బిన్‌లలో చెత్త పేరుకుపోతోంది. షాపూర్‌నగర్– సూరారం ప్రధాన రహదారిలో ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన డంపర్ బిన్‌లో చెత్త పేరుకుపోయినా తొలగించడం లేదు. దీంతో డబ్బాలు నిండి చెత్త రోడ్డు మీద పడుతోంది. సంబంధిత అధికారులు చెత్తను తరలించే ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



పనులు పూర్తి .. ప్రారంభించడం మరిచి!

సుభాష్‌నగర్: గాజులరామారంలో జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అలంకార ప్రాయంగా మారింది. 4.5 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు పూర్తై నెలలు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో రోడ్డు భాగాన నాటిన మొక్కలు పశువులకు మేతగా మారాయి. సాయంత్రం వేళలో మందుబాబులకు అడ్డాగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభించాలని కోరుతున్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్య పరికరాల అందజేత



సాక్షి, సిటీబ్యూరో : సీఎస్‌ఆర్‌లో భాగంగా చెన్నైలోని కెరీర్ ట్రీ హెచ్‌ఆర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ , హైదరాబాద్‌లోని యునైటెడ్ స్టేట్స్ ఫార్మకోపియా (యూఎస్పీ) సహకారంతో మేడ్చల్ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో డెలివరీ బెడ్లు, బేబీ వార్మర్లు, బయోకెమిస్ట్రీ ఎనలైజర్లు, సెల్ కౌంటర్ మెషిన్లు, వైద్య పరికరాలను అందజేశారు. ఈ మేరకు గురువారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. ఉమాగౌరీకి ఈ వైద్య పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కెరీర్ ట్రీ హెచ్‌ఆర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, యునైటెడ్ స్టేట్స్ ఫార్మకోపియా (యూఎస్పీ) బృందంతో పాటు అదనపు జిల్లా వైద్యాధికారి డా.సత్యవతి, సూపరింటెండెంట్ మహమ్మద్ సలీం, ఎన్‌హెచ్‌ఎమ్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి మంజుల రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకనే కేంద్రం కుట్ర



నిరసనకు వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: రాజకీయంగా కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే దమ్ములేకనే అగ్ర నాయకులపై కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక అంశంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీల పేర్లను ఈడీ చార్జిషీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ గురువారం శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణుల ఆందోళనకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువనేత రాహుల్‌గాంధీకి దేశ వ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణను చూసి బీజేపీ భయపడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను పక్కనపెట్టి, ప్రజా సంక్షేమాన్ని మర్చిపోయిందని, రాజ్యాంగ సంస్థలను ఉపయోగించి ప్రతిపక్ష పార్టీలపై కేసులు పెట్టే పనిలో ఉందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బొంగునూరి శ్రీనివాసరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, నిజాంపేట్ మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాసరెడ్డి, మాజీ కౌన్సిలర్ రాముగౌడ్, కుత్బుల్లాపూర్ యూత్‌కాంగ్రెస్ ప్రెసిడెంట్ మనీష్‌యాదవ్, మైనార్టీ నాయకులు రషీద్ బేగ్, కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, మాజీ కౌన్సిలర్ జయరామ్, బైరి శివకుమార్‌గౌడ్, డప్పు నరేందర్, ఏనుగుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని..

మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

సాక్షి, సిటీబ్యూరో: పెండింగ్‌లో ఉన్న 5 నెలల వేతనాలు చెల్లించాలని మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. గురువారం తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ.. మేడ్చల్, షామీర్‌పేట్, మూడుచింతపల్లి, మండలాల్లోని గ్రామపంచాయతీ కార్మికులకు బకాయి ఉన్న 5 నెలల జీతం వెంటనే ఇవ్వాలని కోరారు. రోజువారీ ఖర్చులకు స్కూల్ ఫీజు ఇంటి అద్దె, నిత్యావసరాల సరుకులకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణ, గ్రామపంచాయతీ కార్మిక నాయకులు సుధాకర్, ప్రశాంత్, శ్రీనివాస్, కృష్ణ, రాములమ్మ గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

భూ భారతితో వివాదాలకు శాశ్వత పరిష్కారం

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీ బ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి, నూతన ఆర్‌ఓఆర్ చట్టం ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం మేడ్చల్ కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో భూభారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టంపై తహసీల్దార్లు, జిల్లా రెవెన్యూ అధికారులకు అవగాహన కల్పించేందుకు అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. భూభారతి ఆర్‌ఓఆర్ చట్టంలోని అన్ని అంశాలను క్షుణ్ణంగా చదివి పూర్తి అవగాహన చేసుకోవాలన్నారు.

- 1989 ఆర్‌ఓఆర్ చట్టంలోని అంశాలు భూభారతిలోని అంశాలు కొంత వరకు సిమిలర్గా ఉన్నాయన్నారు. రెవెన్యూ అధికారులకు ధరణిలో లేని అధికారాలు భూభారతిలో ఉన్నాయని, ఈ అధికారాలతో రెవెన్యూ అధికారులపై బాధ్యత మరింత పెరిగిందన్నారు.
- ప్రతీది ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ రికార్డులను నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రెవెన్యూ అధికారులకు పూర్తిస్థాయి అధికారాలు వచ్చే వరకు ప్రొసీడింగ్స్ ద్వారా మాన్యువల్‌గా నిర్వహించాలన్నారు.
- నూతన మార్గదర్శకాలతో సమ్మతించడం, తిరస్కరించడం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్‌ఓఆర్ చట్టాన్ని తెచ్చిందన్నారు.
- ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ భారతి 2025 చట్టంలో 23 సెక్షన్లు, 18 నిబంధనలు ఉన్నాయని, ప్రభుత్వం ఆధార్ తరహాలో భవిష్యత్తులో భూమికి సంబంధించి సర్వేచేసి కొలతలు, హద్దుల వంటి సమగ్రమైన వివరాలతో ౹భూధార్‌౹ తీసుకురాబోతుందని పేర్కొన్నారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడిందన్నారు.
- భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌కు ముందు తప్పనిసరిగా భూమి సర్వేచేసి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.
- ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాల పరిష్కారం ఈ చట్టం ద్వారా వేగవంతం కావడంతో పాటు, వారసత్వ భూముల మ్యూటేషన్‌ను గడువులో పూర్తిచేయడం, హక్కుల సంక్రమణను అధికారికంగా నమోదు చేయడం ద్వారా వ్యవస్థ మరింత నిబద్ధతతో పనిచేస్తుందని కలెక్టర్ తెలిపారు.
- భూ సమస్యల పరిష్కారానికి రెండంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తుందన్నారు.
- ఇళ్ల స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.
- గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణను శాస్త్రీయంగా చేస్తూనే, మోసపూరితంగా పొందిన ప్రభుత్వ భూములపై పట్టాలను రద్దు చేసే అధికారం ఈ చట్టం ద్వారా కల్పించబడిందని, భూ భారతి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారంగా నిలుస్తోందన్నారు.
- భూ సమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూభారతి చట్టంపై అవగాహనను ఏర్పరచుకోవాలని కలెక్టరు సూచించారు.
- ఈనెల 19 నుంచి జిల్లాలో అవగాహన సదస్సులు ఉంటాయని, ఈ సదస్సుల ద్వారా భూభారతి చట్టంపై ప్రజలు, రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, శ్యామ్‌ప్రకాష్, డిప్యూటి కలెక్టర్ వంశీ మోహన్, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్